TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

ఎడిటర్ : బిఎస్ శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 55 | సోమవారం, సెప్టెంబర్ 07, 2026, | పేజీలు - 4 | వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 55 | 07-09-2026 (MONDAY) | PAGES: 4 | RS : 5/-

విలేకరులు కావలెను

అనుభవజ్ఞులైన జర్నలిస్టుల సారథ్యంలో
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రెండు తెలుగు రాష్ట్రాలలో
అతితక్కువ సమయంలో గుర్తింపు,
ప్రజాధరణ పొందిన ప్రింట్ - డిజిటల్ పత్రిక
రంగంలో ముందుకు దూసుకువెళుతూ..
అందరినీ ఆకట్టుకున్న
'ఆదాబ్ సైబరాబాద్'
దిన పత్రిక.

1. జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్
2. జిల్లా ఫోటో గ్రాఫర్స్
3. ఆర్. సీ ఇన్చార్జులు
4. మండల రిపోర్టర్స్
5. క్రైమ్ రిపోర్టర్స్

అనుభవజ్ఞులకు ప్రాధాన్యం అలాగే నూతన అభ్యర్థులకు అవకాశం కల్పించబడును.

సంప్రదించాల్సిన నెంబర్
8686861338

## రోడ్ల మీద కాదు.

# సభకు వస్తే సమాధానమిస్తాం

**హైదరాబాద్, సెప్టెంబర్ 06:** తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం పక్కదారి పడుతోందని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. రోడ్లపై మాట్లాడటం, ధర్నాలు చేయడం కాకుండా అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తాము సమాధానం చెబుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు. నాడు రేషన్ కార్డులు ఇస్తామని చెప్పామని, చెప్పినట్టుగానే ఇచ్చామనీ ఆయన అన్నారు. అలాగే అర్హులందరికీ పార్టీలు చూడకుండా రేషన్ కార్డులు మంజూరు చేశామని కూడా ఆయన చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేని దుస్థితి నెలకొందని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం అందిస్తున్నామని, పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తోందని మంత్రి గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామన్న ఆయన.. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆ సౌకర్యాన్ని వినియోగించుకోవడం లేదా అని నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీలు.. కాంగ్రెస్‌పై విషం చిమ్ముతున్నాయని ఆరోపించారు. విపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ



సమావేశాలకు హాజరై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని హితవు పలికారు. కేటీఆర్, హరీశ్‌రావులు.. అధికార ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కంటే ముందుగా తమ ప్రభుత్వ హయాంలో ఇదే అంశాలపై నాటి సీఎం కేసీఆర్‌ను ఎందుకు అడగలేదని శ్రీధర్‌బాబు మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకత్వం ఇదే వైఖరిని కొనసాగిస్తే మరికొంతకాలం రోడ్లపైనే ఉండాల్సి వస్తుందన్నారు. చర్యలు తీసుకోవాలని ప్రజలే కోరుతున్నారు: మంప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ప్రజలే ఆయన్ను సభకు ఎందుకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారన్నారు. 360 రోజులు విధులకు హాజరుకాకపోతే ఓ ఉద్యోగిని ఎలా తొలగిస్తారో.. అలాగే అసెంబ్లీకి హాజరుకాని అభ్యర్థులపైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో పేదలకు న్యాయం జరగలేదని ఆరోపించారు. 'అల్లుడు, బిడ్డ వస్తే ఎక్కడ పడుకోవాలి?' అని అప్పట్లో మాట్లాడిన కేసీఆర్.. ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లైనా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుస్తోందన్నారు. తమ హయంలో ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు కూడా ఇచ్చామని చెప్పుకొచ్చారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలను ఎదుర్కొనే ధైర్యం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకు ఉండాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, విభజనను గతంలో అవహేళన చేసిన బీజేపీ నేతలకు తెలంగాణపై మాట్లాడే నైతిక హక్కులేదని వ్యాఖ్యానించారు.

## ఈహెచ్ఎస్

# అమల్లో రాజీ లేదు



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 :** ఈహెచ్ఎస్ అమల్లో రాజీ లేదని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క -స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ఈహెచ్ఎస్‌పై (ఆదివారం) రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు. ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, డిపెండెంట్ల ఆరోగ్య భద్రతే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు మానవీయ కోణంలో పరిష్కరించామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆర్థిక, మానసిక ఇబ్బందులు లేకుండా ఉద్యోగులకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ సంఘాలతో చర్చించి ఈహెచ్ఎస్ విధివిధానాలను రూపకల్పన చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం 354 ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈహెచ్ఎస్ సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మరిన్ని ఆస్పత్రులను డీమ్డ్ ఎంప్యానెల్డ్ విధానంలో చేర్చామని చెప్పుకొచ్చారు.

## అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా

# హాజరుకావాలి



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 :** అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ అధ్యక్షతన (ఆదివారం) ఎర్రవల్లిలో ని ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడారు. శాసనసభలో, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని ఆదేశించారు. ఎవ్వరు అసెంబ్లీ సమావేశాలను లైట్‌గా తీసుకోవద్దని మార్గ నిర్దేశం చేశారు.స్పీకర్ వైఖరిపై బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో చర్చించాలని కేసీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు పదిహేను నుంచి ఇరవై రోజులు నిర్వహించేలా బీఏసీ సమావేశంలో పట్టుబట్టాలని నేతలకు కేసీఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు కోపంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పర్య టనలు చేస్తానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వందశాతం అధికారంలోకి వస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఇది సర్వభ్రష్ఠ ప్రభుత్వమని విమర్శించారు. కాంగ్రెస్ హామీలను చూసి ప్రజలు మోసపోయారని అన్నారు. ప్రజలకు అర్థమైందని చెప్పారు. నదీ జలాల వాటాల విషయంలో అవసరమైతే యుద్ధమేనని కేసీఆర్ స్పష్టం చేశారు.

## కుప్పకూలిన హాస్టల్ భవనం

# - ఒకరు మృతి



**దిల్లీ:** సత్య నికేతన్ ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. భవన శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులు సహాయక చర్యలు చేపడతున్నారు. ఇప్పటివరకు ఇద్దరిని సురక్షితంగా రక్షించారు. ఈ ఘటన నేపథ్యంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్? షా తన గోవా పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట ముప్పై నిమిషాల సమయంలో భవనం ఒక్కసారిగా కుప్పకూలిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఈ భవనాన్ని విద్యార్థుల వసతి గృహంగా ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన సమయంలో భవఉరం సెలవు కావడంతో ఎక్కువ మంది విద్యార్థులు తమ గదుల్లోనే ఉన్నట్లు సమాచారం. సత్య నికేతన్ పరిసర ప్రాంతాల్లో అనేక కళాశాలలు ఉన్నాయి. దీంతో అక్కడ అనేక హాస్టళ్లు సహా నివాస సముదాయాలు ఉన్నాయి.

# త్వరలో తెలంగాణ ఆర్టీసీ హైదరాబాద్ మెట్రో రైల్ ఉమ్మడి పాస్

## మెట్రో రైల్లో సీఎస్ సంజయ్ జాజు ఆకస్మిక తనిఖీలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 :** త్వరలో తెలంగాణ ఆర్టీసీ- హైదరాబాద్ మెట్రో రైల్ ఉమ్మడి పాస్ ఏర్పాటు చేయడానికి రాష్ట్రం ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ క్రమంలోనే మెట్రో - ఆర్టీసీ ఉమ్మడి పాస్ జారీ చేయాలని అధికారులను ప్రభుత్వ సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. నెలవారీ, రోజువారీ పాస్‌లను జారీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే మెట్రో, ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి పాస్ జారీ చేయడానికి సాంకేతిక పరంగా సిద్ధంగా ఉన్నామని అధికారులు స్పష్టం చేశారు. ఉమ్మడి చార్జీలను త్వరితగతిన ఖరారు చేసి వెంటనే పాస్‌ల విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు.కాగా, మెట్రో రైల్లో సీఎస్ సంజయ్ జాజు (ఆదివారం) ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సాధారణ ప్రయాణికుడిగా మెట్రోలో సీఎస్ ప్రయాణించారు. బేగంపేట్ నుంచి ప్యారడైజ్ వరకు మెట్రోలో ప్రయాణం చేశారు. మెట్రో సేవలు, ప్రయాణికుల సౌకర్యాలపై పరిశీలించారు. ఆయా స్టేషన్లలో సౌకర్యాలు, నిర్వహణపై అధికారులతో ఆరా తీశారు. ప్రయాణికుల రద్దీ, రైళ్ల నిర్వహణపై సీఎస్ వ రి శీ లి ం చా ర ు . ప్ర య ా ణి క ు ల క ు అందుతున్న సేవల గురించి సీఎస్ ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. మెరుగైన, సురక్షిత ప్రజా రవాణాపై అధికారులతో చర్చించారు. మెట్రో సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచాలని ఆదేశించారు. ప్రజల అవసరాలు, సమస్యలు తెలుసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని సీఎస్ వివరించారు. సీఎస్ వెంట మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అడిషనల్ ఎండీ అజిత్ రెడ్డి ఉన్నారు.

## 2029 నాటికి డ్రగ్స్ రహిత

# భారతదేశమే లక్ష్యం




**హైదరాబాద్ :**డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకరమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్రం స్పష్ట మైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని వెల్లడిం చారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్‌తో అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, నక్సలిజాన్ని దేశం నుంచి ఏ విధంగా నిర్మూలించామో, అదే రీతిలో మత్తుపదార్థాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతామని ధీమా వ్యక్తం చేశారు."2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్‌ను ముందుకు నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. 2014 కంటే ముందు, నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల)పై పోరాటం చాలా వరకు చిన్న చిన్న విభాగాలుగు, ఒంటరిగానే సాగింది. అప్పట్లో ఏజెన్సీలు చిన్న చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవి. కానీ మా ప్రభుత్వం ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది" అని అమిత్ షా అన్నారు.

## ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లపై

# స్పెషల్ డ్రైవ్‌కు డీజీపీ ఆదేశం

**హైదరాబాద్ :**కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరిం పులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యా ప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 4న చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు.



ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

## డీజీపీని ఉద్దేశిస్తూ

# ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత

**హైదరాబాద్ :**తనపై సోషల్ మీడియాలో అను చిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారంటూ తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దూషిస్తే మూడేళ్ల జైలు శిక్ష పడే చట్టాలు ఉన్నప్పటికీ పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహ రిస్తోందని, సదరు కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరించారు.



బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, "డీజీపీ గారికి ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వారిపై ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా? నాలాంటి ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ డీజీపీ బాధ్యతలు స్వీకరించాకే క్రైమ్ రేటు పెరిగిందని, గంజాయి విక్రయాలపై సిగ్గుచేటు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్న రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాలనలో వారిని పూర్తిగా విస్మరించారని కవిత ధ్వజమెత్తారు. ఉద్యమకారుల్లో ఉన్న నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని, ఇక మిగిలింది ఆమరణ దీక్ష మాత్రమేనని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే ఉద్యమకారుల సంక్షేమంపై స్పష్టమైన గడువుతో కూడిన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తప్పుడు లెక్కలు చూపిన కాంగ్రెస్, ఇప్పుడు బీసీల కోసం ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

సోమవారం,
సెప్టెంబర్ 07, 2026

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



# 4వ సారి సత్యనగర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్.హరి






**ఆదాబ్ సైబరాబాద్,మేడ్చల్:** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని సత్యానగర్ కాలనీ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో 4వ సారి అసోసి యేషన్ ఎన్నికలు నిర్వహించారు. అందులో భాగంగా ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా నాల్గవ సారి ఎస్ హరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు హరి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో నాల్గవసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు కాలనీ వాసులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు అన్నారు. కాలనీలోని సమస్యల పరిష్కారానికి కాల నీ అభివృద్ధికి తాను చేసిన కృషి కారణంగానే మరలఅధ్యక్షుడిగా ఎన్నుకోవడం ఆనందంగా ఉందని హరి తెలిపారు.కాలనీలో ఎలాంటి సమ స్యలు ఉన్న కలసిక ట్టుగా సభ్యులందరితో చర్చించి సమస్యల పరిష్కా రానికి కృషి చేసుకుంటామని అన్నారు. ఈ కార్యక్ర మ ంలో ఉపాధ్యక్షుడు.మోషే దయాన్,కార్యదర్శిఖాజా రఫీఉద్దీన్ అహ్మద్,సంయుక్త కార్యదర్శి లింగారెడ్డి, కోశాధి కారిసురేష్ కుమార్,సలహాదారులుసునీల్,కిష్టయ్య,వెంకటేశ్వర్లు,శ్రీ రామ్ కుమార్,సంస్థాగత కార్య దర్శులు ప్రభాకర్ రెడ్డి,శీతల్ కుమార్,ఉమేష్,విఠల్ రావు, మహిళా విభాగం కల్పన,వసంత కమిటీ సభ్యులుశ్రీ నివాస్, కాశీనాథ్,ప్రదీప్, రాజు, బాబునా యుడు,రాజా రావుశివ శంకర్,,డేనియల్,వినయ్ రాజ్, హనుమ నాయిక్,ఆదర్శ్ పాఠకశివ గణేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం -గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గరిసెల సురేందర్ ముదిరాజ్



**ఆదాబ్ సైబరబస్,మేడ్చల్:** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో దోహదపడుతుందని గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గరిసెల సురేందర్ ముదిరాజ్ అన్నారు. డివిజన్ పరిధిలోని జ్ఞానాపురంలో లబ్ధిదారు నీలూరి స్పందన రాణి భర్త బాలస్వామికి మంజూరైన ఇందిరమ్మ ఇంటిని ఆదివారం ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమక్షంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బేరిఈశ్వర్,కోరని భగవాన్ దాస్ ,శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ అధ్యక్షులు గడిల కృష్ణారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాలకుర్తి మురళి గౌడ్,ఫిలిప్స్,మారేపల్లి సుధాకర్,డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్,వినోద్ గౌడ్ ,చింతల భాస్కర్ ముదిరాజ్ ,హరిబాబు, రవీందర్ గౌడ్.మాదాను ఆరోగ్యం, మాజీ వార్డు సభ్యులు జెసింతఅమ్మ, బాలస్వామి, శ్రీకాంత్ రెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు, కాలనీ వాసులు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కనీస వేతనాల సలహా మండలిలో సీఐటీయూకు ప్రాతినిధ్యం కల్పించాలి



**ఆదాబ్ సైబరాబాద్, బాచుపల్లి :** కేంద్ర కనీస వేతనాల సలహా మండలి నుంచి సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ)ను మినహాయించడం అన్యాయమని సీఐటీయూ బాచుపల్లి మండల కన్వీనర్ రాథోడ్ సంతోష్ అన్నారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ప్రముఖ కార్మిక సంఘాన్ని మండలి నుంచి తప్పించడం అప్రజాస్వామిక చర్య అని ఆయన విమర్శించారు.ఈ సందర్భంగా రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కోట్లాది మంది కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. కార్మికుల కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు కార్మిక చట్టాల పరిరక్షణ కోసం సీఐటీయూ పోరాడుతోందని తెలిపారు.
కార్మికుల కనీస వేతనాలను నిర్ణయించే ప్రక్రియలో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించడం అత్యంత అవసరమని అన్నారు. కార్మికుల తరఫున బలంగా మాట్లాడుతున్న సీఐటీయూను సలహా మండలి నుంచి మినహాయించడం కోట్లాది మంది కార్మికుల అభిప్రాయాలను, హక్కులను నిర్లక్ష్యం చేయడమేనని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని కేంద్ర కనీస వేతనాల సలహా మండలిలో సీఐటీయూకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులపై జరుగుతున్న దాడులను నిలిపివేయడంతో పాటు కార్మిక సంఘాల ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని కోరారు.కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కనీస వేతనాల నిర్ణయం చేపట్టాలని, సీఐటీయూను మండలి నుంచి మినహాయించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు.

# రాఘవేంద్ర మోటార్స్ ను ప్రారంభించిన చేవెళ్ల ఎమ్మెల్యే



**ఆదాబ్ సైబరాబాద్, చేవెళ్ల :** వికారాబాద్ జిల్లా పూడూరు మండలం బాకాపురం గ్రామానికి చెందిన బార్లపల్లి సంపత్ చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో రాఘవేంద్ర మోటార్స్ మెకానికల్ వర్క్, సర్వీసింగ్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై మెకానికల్ షెడ్ ను ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. యువత స్వయం ఉపాధి రంగాలలో రాణించాలని, కస్టమర్లకు మెరుగైన సేవలు అందించి మంచి పేరు సంపాదించుకోవాలని సూచించారు. ఈ ప్రారంభోత్సవంలో... మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకటరెడ్డి, కౌన్సిలర్ లు బండారి శైలజ ఆగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్, తాళ్లపల్లి నర్సింలు, చేవెళ్ల, ముడిమ్యాల పిఎసిఎస్ చైర్మన్ లు దేవర వెంకటరెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటాయ్య గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, అంతారం గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కో ఆప్షన్ మెంబర్ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా, అడ్వకేట్ రామకృష్ణ, నిర్వాహకుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వనంలో డంపింగ్ యార్డ్.. తీవ్ర ఇబ్బందులతో ప్రజలు

**-పల్గుట్ట, కందవాడలో వార్డులలో బీఆర్ఎస్ నిరసన**
**-డంపింగ్ యార్డ్ తరలించుకుంటే పెద్ద ఎత్తున ధర్నా చేస్తాం**
**-మున్సిపల్ చైర్మన్, కమిషనర్ వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలి**
**-మాజీ డిసిఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్**



**ఆదాబ్ సైబరాబాద్, చేవెళ్ల :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పాలనలో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల ప్రభుత్వ పాలనను నిరసిస్తూ బిఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు చేపట్టిన ఏడు రోజుల నిరసనల్లో భాగంగా ఆదివారం ఐదో రోజు చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని కందవాడ, పల్గుట్ట వార్డులలో నిరసన ఆందోళన చేపట్టారు. బిఆర్ఎస్ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో 'పల్లెల విధ్వంసం.. పడకేసిన పారిశుధ్యం' నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ... పల్లెల్లో అభివృద్ధి పడకేసిందని పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని మండిపడ్డారు. ప్రజల పక్షాన నిలబడి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కోసం తాము నిరంతరం కొట్లాడుతుంటే ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి మాత్రం కెసిఆర్ రాజీనామా చేయాలంటూ దృష్టి మళ్లించే రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చెత్తతో నిండిన ప్రకృతి వనం పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన పల్లె ప్రకృతి వనాన్ని మున్సిపల్ అధికారులు డంపింగ్ యార్డుగా మార్చారని పెద్దోళ్ల ప్రభాకర్ ఫైరయ్యారు. ఇష్టారాజ్యంగా చెత్త వేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని, ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్ లు స్పందించి డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో... కౌన్సిలర్లు కుర్వ మంగమ్మ మల్లేష్, దేవులపల్లి శ్రీనివాస్ రెడ్డి, దూత మల్లేష్, డప్పు సువర్ణ చందు, మాజీ ఎంపీపీ విజయ్ భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి వంగా శ్రీధర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సామ నరేందర్ రెడ్డి, బిఆర్ఎస్ యూత్ టౌన్ ప్రెసిడెంట్ తోట శేఖర్, గోనె కరుణాకర్ రెడ్డి, బ్యాగరి సుదర్శన్, నత్తి కృష్ణారెడ్డి, దండు సత్యం, మండల ఉపాధ్యక్షుడు రామా గౌడ్, మండల కార్యదర్శి ఊరడి రాంప్రసాద్, వాసుదేవ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, రామస్వామి, దేవరంపల్లి సర్పంచ్ నరహరిరెడ్డి, రఘు రెడ్డి, కడమంచి ఆనంద్, బొట్టు అనంతరెడ్డి, మధు, శంకరన్న, మహేందర్ యాదవ్, వెంకటేష్, శివశంకర్, మహేందర్, ఉపేందర్, తమ్మారెడ్డి గూడెం రాజు, గన్ను తదితరులు పాల్గొన్నారు.

# గంగారంలో ఇంటింటికీ సీసీ రోడ్డు..!

**- 27వ వార్డులో అభివృద్ధికి పెద్దపీట**
**- కౌన్సిలర్ హీరేకర్ రాకేష్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులు**



**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా :** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు గంగారం ప్రాంతంలో స్థానిక కౌన్సిలర్ హీరేకర్ రాకేష్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. కాలనీలోని ప్రతి ఇంటికి సౌకర్యవంతమైన రహదారి కల్పించాలనే లక్ష్యంతో రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. దీంతో గంగారం వాసుల రాకపోకలకు ఇబ్బందులు తొలగడంతో పాటు, వర్షాకాలంలో బురద, గుంతల సమస్యకు పరిష్కారం లభించనుంది. వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు కౌన్సిలర్ రాకేష్ తెలిపారు. "ప్రతి ఇంటికీ రోడ్డు.. ప్రతి కుటుంబానికి మెరుగైన మౌలిక వసతులు" అనే లక్ష్యంతో 27వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

# చేవెళ్లలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**-అర్హులందరికీ సంక్షేమ పథకాలు దక్కుతాయి**
**-చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**ఆధాబ్ సైబరాబాద్, చేవెళ్ల :** ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందించడమే లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డులతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు నిత్యావసర సరుకులు సులభంగా అందడంతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా మరింత చేరువ కానున్నాయని, ప్రతి కుటుంబాన్ని గుర్తించి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు. సంక్షేమ పథకాలకు ఎవరు కూడా దూరం కాకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో... చేవెళ్ల తహసిల్దార్ బి.కృష్ణయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, పీసీసీ క్యాంపెయిన్ కమిటీ జాయింట్ సెక్రెటరీ సున్నపు వసంతం, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, పిఎసిఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ డిసిసి ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుండాల రాములు, కౌన్సిలర్లు బండారి శైలజ ఆగిరెడ్డి, ధవల్గారి గోపాల్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, తాళ్లపల్లి నర్సింలు, కో ఆప్షన్ సభ్యులు బక్కారెడ్డి రవీందర్ రెడ్డి, చాన్ పాషా, ఫరిన్ ఖదీర్ పాషా, మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు మధుసూదన్ గుప్తా, సర్పంచ్ బుచ్చిరెడ్డి, జుట్టు రామస్వామి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కార్తీక్ రెడ్డి, మండల కార్యదర్శి ఎర్ర గోపాల్ యాదవ్, మాజీ సర్పంచులు పడాల ప్రభాకర్, మోహన్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ మల్లేష్, ఉప సర్పంచ్ పాండు, మైనార్టీ నాయకులు అజీజ్, అబ్దుల్ గని, రవీందర్, కరికె మల్లేష్, వీరేందర్ రెడ్డి, శశికాంత్ గౌడ్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో తడినేలలపై జారి పడడం సహజం.. ఈ జాగ్రత్తలు పాటిస్తే సేఫ్‌గా ఉండవచ్చు..



వర్షాకాలంలో తడి నేలలు, జారే రోడ్లు, గుంతలు, అసమానమైన ఉపరితలాల కార ణం గా జారిపడి గాయపడే ప్రమాదం పెరుగుతుంది. ముఖ్యంగా కాలు మెలిక పడటం లేదా చీలమండ తిరగడం సాధారణంగా కనిపించినప్పటికీ, దాన్ని చిన్న గాయంగా నిర్లక్ష్యం చేయకూడదు. కొన్నిసార్లు ఇలాంటి గాయం చీలమండను పట్టి ఉంచే లిగమెంట్లకు నష్టం కలిగించడంతోపాటు ఎముక విరిగేందుకు కూడా కారణమవుతుంది. నొప్పి, వాపు కొనసాగుతున్నప్పటికీ సాధారణ పనులు చేసుకోవడం వల్ల గాయం మరింత తీవ్రం అవుతుంది. అందుకే గాయం తీవ్రతను గుర్తించి, అవసరమైన సమయంలో వైద్య సహాయం తీసుకోవడం పూర్తిస్థాయి కోలుకోవడానికి సహాయపడుతుంది. చీలమండలోని లిగమెంట్లు ఎక్కువగా సాగిపోవడం లేదా చిట్లిపోవడం వల్ల సాధారణంగా స్ప్రెయిన్ ఏర్పడుతుంది. కాలు అకస్మాత్తుగా మెలిక తిరగడం, పడిపోవడం లేదా పాదం ఒకవైపు తిరగడం వంటి సందర్భాల్లో ఇది సంభవిస్తుంది. ఈ గాయం స్వల్పంగా లిగమెంట్ సాగిపోవడం నుంచి పూర్తిగా చిట్లిపోవడం వరకు వివిధ స్థాయిల్లో ఉండే అవకాశం ఉంటుంది. అయితే బలమైన దెబ్బ లేదా పడిపోవడం వల్ల చీలమండ ఎముక విరిగే అవకాశం కూడా ఉంటుంది. తీవ్రమైన నొప్పి, అధిక వాపు లేదా గాయపడిన కాలిపై బరువు వేయలేకపోవడం వంటి లక్షణాలను కేవలం సాధారణ మెలికగా భావించకూడదు.చీలమండ స్ప్రెయిన్, ఫ్రాక్చర్ రెండింటిలోనూ నొప్పి, వాపు, నడవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయి.

# మేడారంలో పర్యటించిన ఇరిగేషన్ చీఫ్

**- జంపన్నవాగులో పనులు చేపట్టేందుకు పరిశీలన**
**- ఊరట్టం రహదారి పక్కన పంటల రక్షణకు కరకట్ట నిర్మాణంపై పరిశీలన**
**- వరద ముంపు లేకుండా చర్యలు భక్తులకు సౌకర్యాల కల్పనకు ప్రణాళిక**



**ఆదాబ్ సైబరాబాద్,ములుగు :** భక్తులు,రైతుల సౌకర్యం కోసం జంపన్నవాగు పరిసర ప్రాంతాలను ఇరిగేషన్ ఇంజినీరింగ్ చీఫ్ ఆదివారం పరిశీలించారు.ఆయన వెంట సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు.తొలుత జంపన్నవాగును సందర్శించి,అక్కడ చేపట్టాల్సిన పనులు,వాటి ప్రదేశాలను పరిశీలించారు.అనంతరం ఊరట్టం రహదారి వైపు వెళ్లి పరిశీలన చేపట్టారు.రహదారి పక్కన ఉన్న పంట పొలాలకు వరద ముంపు సమస్య తలెత్తకుండా కరకట్ట నిర్మాణం చేపట్టే అంశంపై గ్రామస్తులు, రైతులు సూచించిన ప్రాంతాలను పరిశీలించారు.వరద నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు సమాచారం.మేడారం జాతర సమయంలో జంపన్నవాగు పరిసర ప్రాంతాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.జంపన్నవాగు చుట్టుపక్కల వరదల ప్రభావం తగ్గించేలా, నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా అవసరమైన పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.మొత్తంగా సంబంధిత ప్రాంతాలను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు,అవసరమైన పనులను కొద్దిరోజుల్లోనే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

3 | ఆదాబ్ సైబరాబాద్ | TGTEL/26/A4985 | ADAAB CYBERABAD | సోమవారం, సెప్టెంబర్ 07, 2026



# సాయంత్రం భోజనం చేశాక తీపి తినాలనిపిస్తుందా.. అయితే అలా ఎందుకు జరుగుతుంది..?



సాయంత్రం భోజనం చేసిన తర్వాత తీపి తినాలనే కోరిక చాలా మందిలో కనిపిస్తుంది. ఇలా స్వీట్ కోసం పదేపదే అనిపిస్తే శరీరంలో ఏదైనా పోషక లోపం ఉందని భావించడం సహజం. అయితే ప్రతి ఆహార కోరిక వెనుక ఒక నిర్దిష్ట విటమిన్ లేదా మినరల్ లోపమే కారణం అని చెప్పడం సరైనది కాదు. మనం రోజంతా ఎలా తిన్నాం, ఎంత నిద్రపోయాం, ఒత్తిడి ఎలా ఉంది, మన ఆహారపు అలవాట్లు ఎలా ఉన్నాయి వంటి అనేక అంశాలు ఈ కోరికలపై ప్రభావం చూపుతాయి. సోషల్ మీడియాలో ప్రతి ఆహార కోరికను శరీరం పంపే సంకేతంగా, దానికి కారణాన్ని ఒక పోషక లోపంగా చెప్పే విషయాలు తరచూ కనిపిస్తుంటాయి. ఉదాహరణకు చాక్లెట్ తినాలనిపిస్తే మెగ్నీషియం లోపం, ఐస్ తినాలనిపిస్తే ఐరన్ లోపం, ఉప్పగా తినాలనిపిస్తే అడ్రినల్ ఫెటీగ్ అంటూ వివిధ కారణాలు చెబుతుంటారు. కానీ మన శరీరం ఇంత సులభమైన పద్ధతిలో పనిచేయదు.పోషకాహార లోపమా..?సాయంత్రం వేళల్లో తీపి తినాలనే కోరికకు చాలా సందర్భాల్లో ఒకే ఒక్క పోషక లోపం కారణం కాదు. రోజంతా తగినంత ఆహారం తీసుకోకపోవడం కూడా ఇందుకు కారణమవుతుంది. ఉదయం అల్పాహారం తొందరగా ముగించడం లేదా పూర్తిగా మానేయడం, మధ్యాహ్నం ఆరోగ్యంగా తినాలనే ఉద్దేశంతో చాలా తక్కువగా భోజనం చేయడం, సాయంత్రం ఆకలిని కాఫీతో అణచుకోవడం వంటి అలవాట్లు ఉంటే రాత్రి భోజనం సమయానికి శరీరం రోజంతా ఎదురైన ఆహార లోటును భర్తీ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ సమయంలో తీపి తినాలనే కోరిక మరింత పెరుగుతుంది. అలాగే ఆహారపు అలవాట్లు కూడా తీపి కోరికకు కారణమవుతాయి. చిన్నప్పటి నుంచి భోజనం తర్వాత బెల్లం ముక్క, టీతో బిస్కెట్ లేదా భోజనం తర్వాత కీర్ వంటి తీపి పదార్థాలు తినే అలవాటు ఉంటే, క్రమంగా మెదడు ఆ రివార్డ్‌ను ఆశించడం ప్రారంభిస్తుంది. దీంతో తీపి తినకుండా భోజనం పూర్తయినట్లు అనిపించదు. ఇది తప్పనిసరిగా పోషక లోపానికి సంకేతం కాదు.మానసికంగా అలసిపోతే..రక్తంలో చక్కెర స్థాయిలు కూడా కొంతవరకు ప్రభావం చూపిస్తాయి. భారతీయ భోజనాల్లో అన్నం, చపాతీలు, పప్పులు వంటి కార్బోహైడ్రేట్లు ప్రధానంగా ఉంటాయి. వీటిలో తప్పేమీ లేదు. అయితే భోజనంలో తగినంత ప్రోటీన్, ఫైబర్ లేకపోతే ఎక్కువసేపు కడుపు నిండిన భావన ఉండదు. ఫలితంగా భోజనం చేసిన కొద్దిసేపటికే మరోసారి ఏదైనా తినాలనే కోరిక వస్తుంది. ఒత్తిడి కూడా ఈ విషయంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. మానసికంగా అలసిపోయిన రోజు తర్వాత మెదడు త్వరగా ఆనందాన్ని, ఉపశమనాన్ని కలిగించే ఆహారాల వైపు మొగ్గుచూపుతుంది. చాక్లెట్, స్వీట్లు వంటి తీపి పదార్థాలు అలాంటి సమయంలో మరింత ఆకర్షణీయంగా అనిపిస్తాయి. ఇది కేవలం ఆత్మనియంత్రణ లోపం లేదా సంకల్ప బలహీనత అని భావించాల్సిన అవసరం లేదు. నిద్ర కూడా ఆహార కోరికలపై ప్రభావం చూపే ముఖ్యమైన అంశం. వరుసగా కొన్ని రోజులు సరిగా నిద్రపోకపోయినా ఆకలిని నియంత్రించే హార్మోన్లపై ప్రభావం పడుతుంది. దీంతో ముఖ్యంగా చక్కెర, ఎక్కువ రుచి కలిగిన ఆహారాలపై కోరిక పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే ఆహారం విషయంలో నిద్రను కూడా విస్మరించకూడదు.మెగ్నీషియం సంగతేంటి..మెగ్నీషియం విషయానికి వస్తే, శరీరంలో జరిగే వందలాది జీవరసాయన చర్యల్లో దీనికి పాత్ర ఉంది. గ్లూకోజ్ మెటబాలిజం, ఇన్సులిన్ సెన్సిటివిటీ వంటి ప్రక్రియల్లో కూడా మెగ్నీషియం ముఖ్యమైనది. అయితే భోజనం తర్వాత స్వీట్ తినాలనే ప్రతి కోరికను మెగ్నీషియం లోపంతో ముడిపెట్టడం మాత్రం చాలా సరళీకరణ అవుతుంది. ఒక ఆహార కోరిక కనిపించిందని వెంటనే సప్లిమెంట్లు తీసుకోవడం సరైన విధానం కాదు. అందుకే తీపి తినాలనే కోరిక వచ్చినప్పుడు ఏ సప్లిమెంట్ తీసుకోవాలి? అనే ప్రశ్న కంటే ఈ కోరిక రావడానికి ముందు రోజంతా ఏం జరిగింది? అని ఆలోచించడం ఉపయోగకరంగా ఉంటుంది. రోజంతా తగినంత ఆహారం తీసుకున్నామా, భోజనంలో ప్రోటీన్ సరిపడా ఉందా, నిద్ర సరిగ్గా ఉందా, ఒత్తిడి ఎక్కువగా ఉందా, నిజంగా ఆకలిగా ఉందా లేదా అలవాటు ప్రకారం ఏదైనా తినాలనిపిస్తుందా అనే విషయాలను గమనించాలి. అన్నింటికంటే ముఖ్యంగా, తీపి తినాలనిపించడం అంటే మనం ఏదో తప్పు చేశామని అర్థం కాదు. దీనిని బట్టి సంకల్ప బలం తక్కువగా ఉందని, మెటబాలిజం దెబ్బతిన్నదని లేదా మనం ఆరోగ్యకరమైన ఆహార నియమాలను పాటించలేకపోతున్నామని భావించాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు పోషక అసమతుల్యత కారణం అవుతుంది. మరికొన్ని సందర్భాల్లో అలవాటు, ఒత్తిడి లేదా అలసట కారణం అవుతాయి. మరికొన్ని సందర్భాల్లో ఎలాంటి ప్రత్యేక కారణం లేకుండానే తీపి తినాలనిపిస్తుంది. చివరికి, మనం మనుషులం కాబట్టి కూడా అప్పుడప్పుడు స్వీట్ తినాలనే కోరిక వస్తూ ఉంటుంది.

## ఏటా ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకోవడం కాదు..



ఏటా ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకోవడం ఆరోగ్యంపై శ్రద్ధ చూపించే ముఖ్యమైన అలవాటుగా మారింది. రక్త పరీక్షలు, బీపీ కొలతలు, అవసరమైతే స్కాన్లు చేయించుకుని రిపోర్టులు పరిశీలిస్తుంటారు. అయితే పరీక్షల్లో ఏదైనా విలువ సాధారణ స్థాయికి కాస్త ఎక్కువగా లేదా తక్కువగా వచ్చినప్పుడు ఆ తర్వాత ఏం చేయాలి? కేవలం రిపోర్టును చూసి వదిలేయాలా, లేక భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యలను ముందుగానే అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలా? ప్రస్తుతం పెరుగుతున్న జీవనశైలి సంబంధిత, దీర్ఘకాలిక వ్యాధుల నేపథ్యంలో ఈ ప్రశ్నకు ప్రాధాన్యం పెరుగుతోంది. హెల్త్ చెకప్ ఒక వ్యక్తి ఆరోగ్యం ఆ సమయంలో ఎలా ఉందో తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది. అయితే దాని అసలు ప్రయోజనం పరీక్షల ఫలితాలతో ముగియదు. ఏదైనా ఆరోగ్య ప్రమాదాన్ని తొలిదశలో గుర్తించడం, దాని అర్థాన్ని అర్థం చేసుకోవడం, అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా చిన్న సమస్య పెద్ద అనారోగ్యంగా మారకుండా నియంత్రించే అవకాశం ఉంటుంది. అందుకే నివారణ ఆరోగ్య సంరక్షణ కేవలం వ్యాధిని గుర్తించడానికే పరిమితం కాకుండా, వ్యాధి వచ్చే అవకాశాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకునే దిశగా మారాల్సిన అవసరం ఉంది.నిర్ధారణకు ముందే నివారణ చర్యలు..
వ్యాధి నిర్ధారణకు ముందే నివారణ చర్యలు ప్రారంభం కావాలి. ఆరోగ్యంలో వస్తున్న మార్పులను గుర్తించడం, లక్షణాలు కనిపించినప్పుడు వైద్య సలహా తీసుకోవడం, సమస్యలు నిరంతరంగా లేదా తీవ్రంగా మారకముందే వాటిపై దృష్టి పెట్టడం ఇందులో భాగం. హెల్త్ చెకప్‌లు, స్క్రీనింగ్ కార్యక్రమాలు, మెరుగైన డయాగ్నస్టిక్ సదుపాయాలు శరీర పరిస్థితిపై స్పష్టమైన అవగాహన కల్పించి సమస్యలను ముందుగానే గుర్తించేందుకు సహాయపడతాయి. అయితే పరీక్షలో ఏదైనా మార్పు కనిపించిన తర్వాత దానిపై సరైన సమయంలో చర్య తీసుకోవడం మరింత కీలకం. దేశంలో చాలా కాలంగా ప్రివెంటివ్ హెల్త్‌కేర్ అంటే ఏడాదికోసారి హెల్త్ చెకప్ చేయించుకోవడంగానే భావిస్తున్నారు. రక్త పరీక్షలు, స్కాన్లు, ఇతర వైద్య పరీక్షలు చేయించుకున్నప్పటికీ వాటి విలువ వైద్యులు రిపోర్టులను పరిశీలించి, ఏ అంశంపై శ్రద్ధ పెట్టాలో సూచించినప్పుడు మాత్రమే పూర్తవుతుంది. రక్తంలో చక్కెర స్థాయి కొద్దిగా పెరగడం, బీపీ క్రమంగా పెరుగుతుండటం, కొలెస్ట్రాల్ స్థాయిల్లో మార్పులు రావడం లేదా బరువు పెరగడం వంటివి ఒక్కొక్కటిగా చూస్తే పెద్ద సమస్యలా కనిపించవు. కానీ ఇవన్నీ కలిసి చూస్తే ఆరోగ్య పరిస్థితి క్రమంగా మారుతున్నదానికి సంకేతాలుగా ఉంటాయి. వీటిని సరైన సమయంలో గుర్తించి నియంత్రిస్తే భవిష్యత్తులో వచ్చే సమస్యల దిశను మార్చే అవకాశం ఉంటుంది.హెల్త్ చెకప్ ప్రారంభం మాత్రమే.అనే విషయం తెలుస్తుంది.

# వైభవంగా శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ సామూహిక బోనాలు

- అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో
- విజయవంతంగా ముగిసిన బోనాల వేడుకలు



**ఆదాబ్ సైబరాబాద్,ఖమ్మం/దానవాయిగూడెం :** ఖమ్మం దానవాయిగూడెం పార్క్ ఏరియా వాసులు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని, శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక బోనాల కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఖమ్మం దానవాయిగూడెం పార్క్ ఏరియా నుంచి ప్రారంభమైన బోనాల కార్యక్రమంలో పార్క్ ఏరియా వాసులు, మహిళలు, యువతతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఉదయం దానవాయిగూడెం పార్క్ వద్ద భక్తులు బోనాలతో పెద్ద సంఖ్యలో సమకూడారు. అక్కడి నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బోనాలతో భక్తులు ఊరేగింపుగా బయలుదేరి శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు ముత్యాలమ్మ అమ్మవారి నామస్మరణలు, భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక బోనాల కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.
అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ, ఈ సామూహిక బోనాల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, నిర్వాహకులు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసారు.

# గురువులే భవిష్యత్ నిర్మాతలు

- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా
- ఉపాధ్యాయులను సత్కరించిన సైబరాబాద్ సీపీ







**ఆదాబ్ సైబరాబాద్, గచ్చిబౌలి:** విద్యార్థులను ఉన్నతమైన, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గచ్చిబౌలిలోని జెడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారిని ప్రత్యేకంగా అభినందించారు.
ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో తల్లే తొలి గురువు అని అన్నారు. తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్తుకు బాటలు వేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు ఉన్నాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు.
విద్యార్థులు క్రమశిక్షణతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, మహిళల భద్రత, మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో పోలీసులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని చెప్పారు.

### - విద్యార్థులతో సీపీ ముఖాముఖి

అనంతరం సీపీ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థి జూడ్ ప్రశ్నిస్తూ.. ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరాడు. దీనిపై స్పందించిన సీపీ.. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు.మహిళలు, బాలికల భద్రతపై విద్యార్థిని స్నేహిత అడిగిన ప్రశ్నకు సీపీ సమాధానమిస్తూ.. సైబరాబాద్ పరిధిలో మహిళలు, బాలికల రక్షణ కోసం షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే 100 లేదా 112కు ఫోన్ చేయాలని సూచించారు.

### - డ్రగ్స్ కనిపిస్తే పోలీసులకు సమాచారం

పాఠశాలకు వచ్చే మార్గంలో కొందరు వ్యక్తులు మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు కనిపిస్తున్నారని విద్యార్థులు సీపీ దృష్టికి తీసుకువచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు తమ స్నేహితులను కూడా వాటికి దూరంగా ఉంచాలని కోరారు.

### - ఓటీపీ చెబితే ఖాతా ఖాళీ

సైబర్ మోసాలపై విద్యార్థి నిఖిల్ తనకు ఎదురైన అనుభవాన్ని సీపీతో పంచుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓటీపీ అడగడంతో చెప్పానని, ఆ వెంటనే తన ఖాతా నుంచి రూ.4 వేల నగదు డెబిట్ అయిందని తెలిపాడు.ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంకు వివరాలు, పిన్ లేదా వ్యక్తిగత సమాచారాన్ని అడిగితే చెప్పవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

### - ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ప్రధానోపాధ్యాయురాలు రెహానా బేగం, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మునీర్ అహ్మద్‌లను సీపీ డా. ఎం. రమేష్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, రాయదుర్గం ఎస్‌హెచ్ఓ భూపతి, పోలీసు అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుజరాత్ అభివృద్ధి నమూనాపై తెలంగాణ మీడియా దృష్టి

- పీఐబీ ఆధ్వర్యంలో 10 మంది జర్నలిస్టుల వారం రోజుల పర్యటన
- సబర్మతీ రివర్‌ఫ్రంట్ నుంచి ధోలేరా, గిఫ్ట్ సిటీ వరకు కీలక ప్రాజెక్టుల పరిశీలన




**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్:** గుజరాత్‌లోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు తెలంగాణకు చెందిన 10 మంది పాత్రికేయుల బృందం పర్యటనకు బయలుదేరింది. హైదరా బాద్ పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పర్యటన సెప్టెంబర్ 6 నుంచి 12 వరకు కొనసా గనుంది. మీడియా కమ్యూనికేషన్ అధికారి (ఎంసీవో) వర్గంటి గాయత్రి నేతృత్వంలో బృందం ఆదివారం అహ్మదాబాద్ చేరు కుంది. అక్కడ పీఐబీ అధికారులు బృందానికి స్వాగతం పలికారు.

### - అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టుల సమాచారాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడంతోపాటు.. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల అనుభవాలను పరస్పరం పంచుకోవడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. గుజరాత్‌లో మౌలిక వసతులు, పారిశ్రామిక రంగం, విద్య, ఆర్థిక సేవలు, వ్యవసాయం, పాడి పరిశ్రమ తదితర రంగాల్లో సాధించిన పురోగతిని పాత్రికేయులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు.

### - కీలక ప్రాజెక్టుల సందర్శన

పర్యటనలో భాగంగా సబర్మతీ రివర్‌ఫ్రంట్, ధోలేరా ప్రత్యేక పెట్టుబడుల ప్రాంతం (ధోలేరా ఎస్ఐఆర్), గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్-సిటీ (గిఫ్ట్ సిటీ), అమూల్ డెయిరీ, ఐక్యతా మూర్తి, సర్దార్ సరోవర్ ఆనకట్ట తదితర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను బృందం సందర్శించనుంది. అదేవిధంగా సీఈపీటీ విశ్వవిద్యాలయం, జాతీయ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యాలయం, సబర్మతీ మల్టీ మోడల్ హబ్‌లను కూడా పరిశీలించనుంది. ఆయా ప్రాజెక్టులు, సంస్థల అధికారులు, సంబంధిత భాగస్వాములతో సమావేశమై వాటి పనితీరు, అభివృద్ధి తీరుపై వివరాలు తెలుసుకోనున్నారు.
వారం రోజులపాటు జరిగే ఈ పర్యటన ద్వారా గుజరాత్‌లో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై తెలంగాణ మీడియాకు క్షేత్రస్థాయి అవగాహన ఏర్పడనుంది.

సోమవారం,
సెప్టెంబర్ 07, 2026
TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD





# ప్రమాదంలో జంపన్నవాగు ప్రాముఖ్యత..!

# ఇసుకను తోడేస్తున్న మాఫియా

- -అనుమతి పేరుతో అక్రమ తరలింపులు
- -పగలు-రాత్రి తేడా లేకుండా ఇసుక రవాణా
- -మిషన్లతో తవ్వకాలు.. లారీల్లో తరలింపు
- -పట్టణాలకు యథేచ్ఛగా అమ్మకాలు
- -వాగుకు ఇరువైపులా భూములకు ముప్పు
- -అధికారుల మౌనంపై అనుమానాలు



టిప్పర్లలో తరలిపోతున్న ఇసుక

**ఆదాబ్ సైబరాబాద్, ములుగు :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం లోని జంపన్నవాగులో ఇసుక తవ్వకాలు హద్దులు దాటుతున్నాయా..? అనుమతుల పేరుతో అక్రమాలకు తెరలేపుతున్నారా..? పగలు-రాత్రి తేడా లేకుండా మిషన్లతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లు,టిప్పర్లు,లారీల్లో తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.ఒకప్పుడు సహజ వనరుగా ఉన్న జంపన్నవాగు ఇప్పుడు ఇసుక వ్యాపారానికి కేంద్రంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జంపన్నవాగూలో వేరుచేసిన ఇసుక కుప్పలు

## మిషన్లతో తవ్వకాలు.. వరుసగా కదులుతున్న టిప్పర్లు...!

ఊరట్టం కాజ్‌వే వద్ద ఇప్పటికే పెద్దఎత్తున ఇసుకను తవ్వి తరలించారని,ప్రస్తుతం చిలకలగుట్ట వైపు కూడా తవ్వకాలు సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.మిషన్లతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో పోసి,అక్కడి నుంచి లారీల్లోకి తరలిస్తున్నట్లు చెబుతున్నారు.రైలుపెట్టెల్లా వరుసగా టిప్పర్లు కదులుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. వరంగల్, హైదరాబాద్, కొత్తగూడెం,ములుగు,ఆలేరు తదితర పట్టణాలకు ఇసుక తరలించి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.సోషల్ మీడియాలో సైతం ఇసుక రవాణాకు సంబంధించిన ప్రచారం జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

## వాగు కొల్లగొడితే.. భూములకు వరద ముప్పు..!

జంపన్నవాగు నుంచి ఇష్టారాజ్యంగా ఇసుకను తొలగిస్తే వాగు సహజ ప్రవాహ మార్గం దెబ్బతినడంతో పాటు,వాగుకు ఇరువైపులా ఉన్న వ్యవసాయ భూములకు భవిష్యత్తులో వరద నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇసుక తవ్వకాలపై నిబంధనలు,పర్యావరణ పరిరక్షణ,వాగు సహజ స్వరూపం వంటి అంశాలను అధికారులు పరిగణనలోకి తీసుకుంటున్నారా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## 'మాకే ఇవ్వాలి' అన్న గిరిజనుల వినతి.. మరి ఇప్పుడు ఇంత ఇసుక ఎలా..?

మేడారం,రెడ్డిగూడెం,ఊరట్టం తదితర ప్రాంతాలకు చెందిన గిరిజనులు, పూజారులు తమ హక్కుల ప్రకారం జంపన్నవాగులోని ఇసుకను తమకు అనుమతించాలని తహశీల్దార్‌ను కోరినప్పటికీ అనుమతి నిరాకరించారని పూజారుల సంఘం ప్రతినిధులు చెబుతున్నారు.అయితే అదే వాగులో ఇతరులు భారీ స్థాయిలో ఇసుక తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారనే ఆరోపణలు రావడంతో గిరిజనులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమ హక్కులను పక్కనపెట్టి ఇతరులకు ఎలా అవకాశం కల్పిస్తున్నారంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

## కోట్లు కురిపిస్తున్న ఇసుక దందా...?

జంపన్నవాగులో ఇసుక తరలింపు కొందరికి భారీ వ్యాపారంగా మారిందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇసుక తవ్వకాలు, రవాణా,విక్రయాల ద్వారా పెద్ద మొత్తంలో లాభాలు ఆర్జిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి'అన్న చందంగా ప్రస్తుతం ఉన్న అవకాశాన్ని ఉపయోగించుక్ష్ర కుంటున్నారనే ఆరోపణలు స్థానికుల్లో వినిపిస్తున్నాయి.సంబంధిత శాఖల్లో అధికారులు బదిలీ అయ్యేలోపు అందినంత దండుకోవాలనే ధోరణితో వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.జంపన్నవాగులో ఇసుక తవ్వకాలు నిజంగా నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయా..? ఎంత పరిమాణంలో ఇసుక తవ్వకాలకు అనుమతి ఉంది..? ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలకు అనుమతించారు..? రోజుకు ఎన్ని వాహనాలు ఇసుక తరలిస్తున్నాయి..?రవాణాకు అవసరమైన అనుమతులు, రాయల్టీలు చెల్లిస్తున్నారా..?ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉండగా అధికారుల మౌనం ఎందుకు...?



ఊరట్టంకాజువె వద్ద ఇసుక

## ట్రాక్టర్ యజమానులకు ఉపాధి.. యజమానులకు కోట్ల వ్యాపారమా..?

ఇసుక తవ్వకాలతో ట్రాక్టర్ యజమానులకు,డ్రైవర్లకు ఉపాధి లభిస్తున్నప్పటికీ..దీని వెనుక అసలు లాభం ఎవరికి దక్కుతోంది..? ఇసుకను తవ్వేది ఎవరు..? తరలించేది ఎవరు..?విక్రయించేది ఎవరు..?అనుమతుల పరిధిని దాటి తవ్వకాలు జరిగితే పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎవరిది..?మూడు నెలలుగా ఇసుక తవ్వకాలు కొనసాగు తున్నాయనే ఆరోపణలు వస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

## 'చేతులు తడిస్తే' వాగు గుల్లేనా...?

ప్రభుత్వ వనరులను రక్షించాల్సిన అధికార యంత్రాంగమే మౌనంగా ఉంటే అక్రమార్కులకు మరింత ధైర్యం వస్తుందని స్థానికులు విమర్శిస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇసుక తవ్వకాలు హద్దులు దాటుతున్నాయా..? లేక అక్రమాలకు ఎక్కడైనా అధికారుల అండ ఉందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.జంపన్నవాగు ప్రజల ఆస్తి..కొందరి లాభాల కోసం దాన్ని కొల్లగొట్టేందుకు అనుమతించ కూడదని స్థానికులు కోరుతున్నారు. ఇసుక తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి,అనుమతుల పరిధి,తవ్విన ఇసుక పరిమాణం,తరలించిన వాహనాలు,రాయల్టీ చెల్లింపులు తదితర అంశాలను అధికారులు బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



వాగు ఒడ్డున పోసిన కుప్పలు

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

# హైదరాబాద్ మొత్తం చుట్టేయడానికి గ్రేటర్ ఆర్టీసీ గుడ్‌న్యూస్ - 15 బస్సు సర్వీసులు ప్రారంభం



హైదరాబాద్ : హైదరాబాద్ మొత్తాన్ని కవర్ చేసేలా గ్రేటర్ ఆర్టీసీ సుదూర బస్సు సర్వీసులను ప్రవేశపెట్టింది. పారిశ్రామిక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలు, శివారులోని నివాస ప్రాంతాలను అనుసంధానించడానికి 15 సర్వీసులను ప్రారంభించారు. ఈ విధానం వల్ల ప్రయాణికులు ఒకే బస్సులో సగటున 50 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు. దీనివల్ల రెండు లేదా మూడు సార్లు బస్సులు మారాల్సిన అవసరం ఉండదు. శివారు ప్రాంతాల ప్రజలు ఇప్పుడు గోల్కొండ, చార్మినార్, హుస్సేన్ సాగర్, దుర్గం చెరువు, బొటానికల్ గార్డెన్, శిల్పారామం, బిర్లా మందిర్, చిలుకూరు బాలాజీ ఆలయం వంటి ప్రముఖ ప్రదేశాలను సులభంగా సందర్శించవచ్చు. 1. 218ఎ (హయత్ నగర్ నుంచి పటాన్‌చెరు వరకు) : ఈ సర్వీసు హయత్ నగర్, చింతలకుంట, ఎల్బీనగర్ క్రాస్‌రోడ్స్, మలక్‌పేట్, కోఠి, పంజాగుట్ట, కేపీహెచ్?బీ, లింగంపల్లి మీదుగా పటాన్‌చెరుకు వెళుతుంది. ఇది హైదరాబాద్?లోని ప్రధాన రవాణా వ్యవస్థను ఐటీ శివారు ప్రాంతాలతో అనుసంధానించే చాలా సుదీర్ఘమైన మార్గం. 2. 156/217 (హయత్ నగర్ నుంచి పటాన్‌చెరు వరకు), 156ఎ/505 (ఎన్?జీవో కాలనీ నుంచి శంకర్ పల్లి వరకు) : ఈ మార్గం తూర్పు హైదరాబాద్‌ను పశ్చిమ ఐటీ హబ్‌తో అనుసంధానిస్తుంది. హయత్ నగర్, వనస్థలిపురం, ఎల్బీ నగర్, మలక్‌పేట్, కోఠి, లక్డీకాపూల్, మెహదీపట్నం, టోలిచౌకి, గచ్చిబౌలి, హెచ్?సీయూ, లింగంపల్లి, రామచంద్రాపురం మీదుగా ప్రయాణించి పటాన్‌చెరు, అలాగే కొల్లూరు క్రాస్‌రోడ్స్, శంకర్?పల్లికి చేరుకోవచ్చు. 3. 8ఏ/253వీ (సికింద్రాబాద్ నుంచి చార్మినార్, మహేశ్వరం వరకు) : ఈ బస్సు చార్మినార్, పాత నగరంలోని వివిధ పర్యాటక ప్రదేశాల మీదుగా తన గమ్యస్థానానికి చేరుకుంటుంది. ఇది సికింద్రాబాద్, పాట్నీ, బోట్ క్లబ్, బషీర్‌బాగ్, నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్, అఫ్జల్‌గంజ్, ఫరూఖ్‌నగర్, చంద్రాయణగుట్ట, బర్కాస్, జల్పల్లి క్రాస్‌రోడ్స్, పహాడీషరీఫ్, తుక్కుగూడ మీదుగా ప్రయాణించి చివరకు మహేశ్వరం చేరుకుంటుంది. 4. రూట్లు 113వీ/217, 300/316 దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీ నగర్, ఉప్పల్ ప్రాంతాలకు రవాణా సౌకర్యం : ఈ రూట్లు ప్రధానంగా ఉప్పల్, హబ్సిగూడ, తార్నాక, రామాంతపూర్, ఎల్బీనగర్ వంటి ప్రాంతాల నుంచి మెహదీపట్నం, గచ్చిబౌలి ఐటీ కారిడార్లకు ప్రయాణికులను చేరవేస్తాయి. ఐటీ ఉద్యోగులకు, పర్యాటకులకు ఉపయోగకరంగా ఉంటాయి. 5. రూట్లు 1/25ఎస్/229, 290ఖ/229 : ఈ కంబైన్డ్? రూట్లు సికింద్రాబాద్, అల్వాల్, కొంపల్లి, మేడ్చల్ వైపు ఉన్న ప్రాంతాలను హైదరాబాద్ కేంద్రంతోనూ అలాగే జేబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, హయత్?నగర్ వంటి తూర్పు ప్రాంతాలతోనూ అనుసంధానిస్తాయి. ఉత్తర, తూర్పు హైదరాబాద్‌లోని ప్రయాణికులకు ఇవి ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయి. కోఠి టూ కొల్లూరు రూట్‌లో 116ఎన్?/220కె, 217/220కె, 218/220కె బస్సులు అందుబాటులో ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి కొల్లూరు రూట్‌లో 10ఎ/220, 219/220ఖ సర్వీసులు నడుస్తాయి. సికింద్రాబాద్, ఘట్‌కేసర్ మధ్య ఆర్టీసీ ప్రత్యక్ష బస్సు సర్వీసును (24దీ/281)

# కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల పక్షాన మాట్లాడాలి

సిద్దిపేట జిల్లా, సెప్టెంబర్ 6 : సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా ఈ దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా రాష్ట్ర ప్రజల భూములను 22 ఏలో పెట్టలేదని తెలిపారు. గజ్వేల్ పట్టణంలో ఎంపీ రఘునందన్ రావు (ఆదివారం) పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పేద ప్రజల భూములను ఈ రోజు దాకా దేశంలో ఏ ప్రభుత్వం కూడా చివరకు ఇందిరా



గాంధీ హయాంలో కూడా 22 ఏ లో పెట్టలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలోని దళిత, గిరిజనుల, నోరు లేని అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహించారు. దాదాపు లక్ష కోట్ల పేదల భూములను 22ఏలో పెట్టీ భారీ కుంభకోణానికి తెర లేపారని ఆరోపించారు. లక్ష కోట్ల భూముల పంచాయితీలో పైసలు పంచుకుంటున్న మంత్రులు ఎవరో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. లేదా ఈ పైసలన్నీ తన ఖాతాలోనే వేసుకుంటానని అనుకుంటే సీఎం అయినా దీనికి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. 22 ఏ లో పేదల భూములను పెట్టొద్దని.. అవి తాతల కాలం నాటి నుంచి వస్తున్న ఆస్తులని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ఈసారి జరిగే శాసనసభ సమావేశాలకు హాజరు కావాలని కోరారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల పక్షాన మాట్లాడితే వారికి గౌరవం ఉంటుందని రఘునందన్ రావు సూచించారు.

# కాంగ్రెస్ మాట విని తప్పుడు కేసులు పెడితే వదిలే ప్రసక్తే లేదు.. వడ్డీతో సహా చెల్లిస్తాం:

హైదరాబాద్ :అధికార కాంగ్రెస్ నేతల ఒత్తిళ్లకు లొంగిపోయి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ కుమార్ పోలీసు యంత్రాంగాన్ని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గం జూలూరుపాడులో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ హయాంలో 'ఫ్రెండ్లీ పోలీసింగ్'తో పారదర్శకంగా



విధులు నిర్వహించిన వ్యవస్థను, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయాల కోసం హింసను ప్రోత్సహించేలా వాడుకుంటోందని తీవ్రంగా ధ్వజమెత్తారు. తెలంగాణలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేసిన పువ్వాడ... అధికార పార్టీ నేతల సైగలకు అనుగుణంగా తప్పుడు పనులు చేస్తున్న పోలీసు అధికారుల జాబితా తమ దగ్గర సిద్ధంగా ఉందన్నారు. చట్టాన్ని పక్కనపెట్టి బీఆర్ఎస్ శ్రేణులను వేధిస్తున్న ప్రతీ ఒక్కరికీ భవిష్యత్తులో వడ్డీతో సహా చెల్లిస్తామని ఘాటుగా హెచ్చరించారు. పోలీసులు ఇకనైనా ఏకపక్ష వైఖరిని విడనాడి, నిష్పాక్షికంగా చట్టపరిధిలో పనిచేయాలని సూచించారు.

# ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు - రోడ్లపైనే పోతున్న ప్రాణాలు

హైదరాబాద్ : ఫుట్‌పాత్‌లు, రోడ్లపై నుంచి ఆక్రమణలను తొలగించాలని రాష్ట్ర హైకోర్టు మున్సిపల్ అధికారులను గతంలోనే ఆదేశించింది. కేవలం ఆక్రమణలను కూల్చివేయడమే కాకుండా, తిరిగి ఆక్రమణలు జరగకుండా గ్రిల్స్ ఏర్పాటు చేసి ఫుట్ పాత్‌లను పునరుద్ధరించాలని న్యాయ మూర్తులు తన ఆదేశాల్లో పేర్కొన్నారు. అయినా మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది. కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పుడు హడావిడిగా చర్యలు చేపట్టడం, తర్వాత ఆ ప్రయత్నాన్ని విరమించడం అధికారులకు అలవాటుగా మారింది. దీనికి ఒక స్పష్టమైన ఉదాహరణ ఏమిటంటే, మూడు నెలల క్రితం జీహెచ్?ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కార్పొరేషన్లు ప్రారంభించిన ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు గత నెల రోజులుగా నిలిచిపోయాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 13, మే 4, జూన్ 23 తేదీలలో ఫుట్‌పాత్ ఆక్రమణల విషయంలో కోర్టు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసింది. తమ ఆదేశాలు అమలు కాలేదని అధికారుల నుంచి ఎటువంటి స్పందన రాలేదని




కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. తిరిగి పుట్టుకొస్తున్న ఆక్రమణలు :ఖైరతాబాద్‌లోని షాదాన్ కాలేజీ, చింతల్ బస్తీ మధ్య రోడ్డు ఆక్రమణలను తొలగించి, రోడ్డు అంచుల వరకు సీసీ (సిమెంట్ కాంక్రీట్) రోడ్డు ను నిర్మించినప్పటికీ, క్రమంగా ఆక్రమణలు మళ్లీ కనిపించడం మొదలయ్యాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, రెజిమెంటల్ బజార్ ప్రాంతాలలో, జీహెచ్ఎంసీ అధికారులు ఆక్రమణలను తొలగించిన కొద్ది రోజులకే వాణిజ్య కార్యకలాపాలు మళ్లీ మొదలయ్యాయి. గాంధీ హాస్పిటల్, కాచిగూడ క్రాస్‌రోడ్స్, సుల్తాన్ బజార్ రోడ్డు, పాతబస్తీలోని చార్మినార్, పత్తర్‌గట్టి, చెట్టా బజార్ రోడ్ల వంటి ప్రాంతాలలో గతంలో తొలగించిన దుకాణాలు మళ్లీ వెలిశాయి. రూ.వేలల్లో ఫీజుల వసూలు :అల్వాల్ సర్కిల్ డైరీ ఫామ్ రోడ్?లోని డీ-మార్ట్ జంక్షన్ వద్ద, రోడ్డుపై చిన్న స్టాల్ ఏర్పాటు చేయడానికి రూ. 25,000 చెల్లించాల్సి ఉంటుంది. మొబైల్ కిచెన్ వాహనాన్ని పార్క్ చేయడానికి రూ. 30,000 ఖర్చవుతుంది. అలాగే ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు అద్దెగా రూ. 50,000 వసూలు చేస్తున్నారు. మణికొండ, నార్సింగి, పుప్పాల్‌గూడ వంటి ప్రాంతాలలో దుకాణదారులు రోడ్డు స్థలాన్ని అద్దెకు ఇస్తున్నారు. టీ స్టాల్స్, పాన్ షాపులు లేదా తోపుడు బండ్ల కోసం రూ. 15,000 అద్దె వసూలు చేస్తుండగా, మొబైల్ క్యాంటీన్లకు రూ. 30,000 అద్దె విధిస్తున్నారు. అమీర్‌పేటలో ఫుట్‌పాత్ స్థలం ధర ఎక్కువ. అక్కడ టిఫిన్ షాపులు, టీ స్టాల్స్ లేదా పాన్ షాపులను ఏర్పాటు చేయడానికి నెలకు రూ. 30,000 అద్దె వసూలు చేస్తున్నారు. పాదాచారులకు ప్రమాదం : రోడ్ల ఆక్రమణల కారణంగా, పాదాచారులు ప్రధాన రహదారిపై నడవాల్సి వస్తోంది. దీనివల్ల వారు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. కొందరు అధికారులు నెలవారీ లంచాలు తీసుకుంటూ ఈ ఆక్రమణలకు సహకరిస్తున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలో రాజకీయ జోక్యం కూడా ఉంది. పేదలకు జీవనోపాధి కల్పిస్తున్నామనే ముసుగులో స్థానిక నాయకులు ఫుట్‌పాత్ స్థలాలను అద్దెకు ఇస్తుంటారు.

# హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

హైదరాబాద్ : కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 4న చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని



పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు. ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

# ఈశ్వర్ సాయి వ్యవహారం.. ఆత్మహత్యాయత్నం చేసిన ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్

హైదరాబాద్ : ప్రముఖ జానపద కళాకారిణి మాధురి రాథోడ్ ఆత్మహత్యకు యత్నించడం తీవ్ర కల కలం రేపింది. మరో జానపద గాయకుడు ఈశ్వర్ సాయిపై తాను చేసిన ఫిర్యాదు విషయంలో న్యాయం జరగడం లేదన్న తీవ్ర మనస్తాపంతో ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నిం చగా, కుటుంబసభ్యులు సకాలంలో గమనించి, తలుపులు పగలగొట్టి ఆమెను రక్షించారు. ఈశ్వర్ సాయి తనను పెళ్లి పేరుతో మోసం చేసి, శారీరకంగా వాడుకుని, ఆ తర్వాత వేధించాడని మాధురి రాథోడ్ గతంలోనే హైదరాబాద్‌లోని నర్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా, ఏఐ టెక్నాలజీతో మార్ఫింగ్ వీడియోలు సృష్టించి తన పరువుకు భంగం కలిగించాడని ఆమె తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈశ్వర్ సాయిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 69 కింద కేసు నమోదు చేశారు. అయితే, అతను పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతుండగా, అరెస్ట్ నుంచి



తప్పించుకునేందుకు ఈశ్వర్ సాయి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. ఇదే వ్యవహారంలో మరో కోణం కూడా ఉంది. ఈశ్వర్ సాయి భార్య శరణ్య, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పోలీస్ స్టేషన్‌లో మాధురిపై ఫిర్యాదు చేశారు. ఒక హోటల్‌లో ఉన్న ఈశ్వర్ సాయి, మాధురి వద్దకు తాను వెళ్లగా, తనపై దాడి చేసి ఐఫోన్ లాక్కున్నట్టు ఆమె ఆరోపించారు. ఈ ఘటనపై కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. మొత్తం మీద మాధురి ఫిర్యాదు, శరణ్య ఫిర్యాదులపై పోలీసుల దర్యాప్తు పూర్తయితేనే ఈ వివాదంలోని వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

# స్మార్ట్ రేషన్ కార్డుల కోసం జనం పరేషాన్

**కరీంనగర్ టౌన్:** స్మార్ట్ రేషన్‌కార్డుల్లోని తప్పులను చూసి జనం తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో 3,21,740 మందికి స్మార్ట్‌రేషన్‌కార్డులను పంపిణీ చేసే కార్యక్రమం జరుగుతోంది. మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో కార్డుల పంపిణీ ప్రక్రియ చిన్నచిన్న ఇబ్బందులతో సాగుతుంటే, కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. నగరంలోని 66 డివిజన్లలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగంలోని జవాన్లకు అప్పగించి




రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకున్నారు. పాత రేషన్‌కార్డుల మాదిరిగా కుటుంబ యజమానురాలి పేరుతోపాటు ఇంటి నంబరు, కాలనీ పేరు, షాపు నెంబరుతో కార్డులు తయారుచేస్తే బాగుండేదని లబ్ధిదారులు అభిప్రాయపడుతున్నారు. ఈసారి మూడు నెలల కోటా బియ్యం మొత్తం పంపిణీ చేశారని, మూడు నెలల తర్వాత కొత్త కార్డు ఉంటేనే బియ్యం ఇస్తారా లేదా, ఒక వేళ కార్డు ఇవ్వకుంటే తమ పరిస్థితి ఏమిటని లబ్ధిదారులు ఆందోళన చెందుతు న్నారు. ఇప్పటి వరకు నగరంలోని కొన్ని డివిజన్లలోనే స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ జరుగుతోంది. కొన్ని చోట్ల అసలు ఎప్పుడు, ఎవరు, ఎక్కడ పంపిణీ చేస్తారో, వార్డు కార్యాలయాల్లో ఇస్తారో, ఇంటింటికి తెచ్చి ఇస్తారో తెలియక ప్రజలు అయోమ యానికి గురవుతున్నారు. కొందరు కార్పొ రేటర్లు వారి సమీప డివిజన్లలోని జవాన్లందరిని పిలి పించి దుకాణాల వారీగా విభజించి పంపిణీ చేస్తు న్నారు. కొన్ని చోట్ల అసలు కార్పొరేటర్లు పట్టించు కోకుండా జవాన్ల వద్దకు వెళ్లాలని చెబు తుండడంతో రేషన్‌కార్డుల పంపిణీ గందరగోళంగా మారింది.

# హైదరాబాద్‌లో కాంగ్రెస్ 'మహాధర్నా'.. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్,: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'మహాధర్నా' బహిరంగ సభ దృష్ట్యా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి. నగరంలోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'మహాధర్నా' బహిరంగ సభ దృష్ట్యా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ క్రమంలో వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలలో మళ్లించాలని ఆదేశాలు జారీ చేశారు. ధర్నాలో భాగంగా కాంగ్రెస్ శ్రేణులు ధర్నాచౌక్ నుంచి ఇందిరా పార్క్ క్రాస్ రోడ్స్, ఆర్కే మఠం, కట్టమైసమ్మ స్లిప్ రోడ్డు మీదుగా ట్యాంక్ బండ్‌లోని పాత అంబేద్కర్ విగ్రహం వరకూ పాదయాత్ర చేయనున్నారు. ఈ క్రమంలో ధర్నా చౌక్, ఇందిరా పార్క్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, బషీర్‌బాగ్, లిబర్టీ, సచివాలయం, బీజేఆర్ విగ్రహం, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉ




న్నట్లు పోలీసు లు తెలిపారు. ఈ నేపథ్యంలో వాహనదారుల కోసం నగర ట్రాఫిక్ విభాగం ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసింది. నల్లకుంట నుంచి స్టీల్ బ్రిడ్జి మీదుగా కట్టమైసమ్మ వైపు వెళ్లే వాహనాలను అజామాబాద్ క్రాస్ రోడ్స్ వద్ద వీఎస్టీ వైపు మళ్లించనున్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి ఇందిరా పార్క్ వైపు వెళ్లే వాహనాలను అశోక్ నగర్ క్రాస్ రోడ్స్ వద్ద హిమాయత్‌నగర్ స్ట్రీట్ నంబర్ 8 లేదా బాకారం బ్రిడ్జ్, కవాడిగూడ వైపు మళ్లిస్తారు. కర్బలా మైదాన్ నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వెళ్లే వాహనాలను సెయిలింగ్ క్లబ్ వద్ద కవాడిగూడ, గాంధీనగర్ టీ-జంక్షన్, డీబీఆర్ మిల్స్, లోయర్ ట్యాంక్ బండ్ వైపు మళ్లించనున్నారు. బీజేఆర్ విగ్రహం వైపు నుంచి పాత అంబేద్కర్ విగ్రహం, ట్యాంక్ బండ్ వెళ్లే వాహనాలను లిబర్టీ టీ-జంక్షన్ వద్ద హిమాయత్‌నగర్ వైపు, హిమాయత్‌నగర్ నుంచి అంబేద్కర్ విగ్రహం లేదా సెక్రటేరియట్ వైపు వచ్చే వాహనాలను బషీర్‌బాగ్ క్రాస్ రోడ్స్, ట్రాఫిక్ పోలీస్ కాంప్లెక్స్ వైపు మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి లిబర్టీ వైపు వెళ్లే వాహనాలను పాత అంబేద్కర్ జంక్షన్ మీదుగా అప్పర్ ట్యాంక్ బండ్ వైపు మళ్లించనున్నారు.